నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 29 మే 2025 | HYDERABAD



## వీధి దీపాలకు కొత్త టెండర్లు

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల నిర్వహణకు కొత్త టెండర్లు పిలిచేందుకు స్టాండింగ్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు నగరంలో వీధి దీపాల నిర్వహణ బాధ్యతల నుంచి ఈఈఎస్ఎల్ గ్రూప్‌ను తప్పించి... కొత్త ఏజెన్సీకి పనులు బల్దియా అప్పగించనున్నది. ఈఈఎస్ఎల్ నిర్వహణ లోపాలు, కొత్త ప్రతిపాదిత టెండర్ విధి విధానాలు, షరతులు, నిబంధనలపై బల్దియా అధికారులతో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మేయర్ ఆర్‌వీ కర్ణన్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి చర్చించారు. ఆ ఏజెన్సీకి ఇచ్చిన గడువు ముగియడంతో... టెండర్ ప్రక్రియ చేపట్టేంత వరకు వీధి దీపాల నిర్వహణ, కొనుగోలు వ్యవహారాలను జోనల్ కమిషనర్ల స్థాయిలో చేపట్టాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు.

## న్యాయపరమైన చిక్కులు వీడాకే..

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ) : కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ పనులు మరింత ఆలస్యం కానున్నాయి. ఈ ప్రాజెక్టులో సేకరించాల్సిన 129కి పైగా ఆస్తులలో పట్టుమని 10 శాతం కూడా పూర్తి చేయలేదు. భూ సేకరణపై న్యాయపరమైన చిక్కులు రోజురోజుకు పెరుగుతుండడం, న్యాయస్థానంలో పిటిషన్లు వరుసగా పడుతుండడంతో భూ సేకరణ అధికారులకు సవాల్‌గా మారింది. అయితే భూ సేకరణపై స్పష్టత లేకుండా ఆగమేఘాల మీద ఇంజినీరింగ్ విభాగం అధికారులు రూ.1090 కోట్ల పనుల టెండర్లను ఆహ్వానించారు. ఇటీవల టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ పనులను 'మేఘా కంపెనీ దక్కించుకున్నది. అయితే ఈ ప్రాజెక్టు పనులను సదరు ఏజెన్సీకి అప్పగించేందుకు మరింత సమయం పడుతుందని అధికారులు తాజాగా సెలవిస్తున్నారు.





పట్టుబడ్డ స్పెషల్ ఆర్‌ఐ భూపాల మహేశ్

• ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీకి లంచం

## ఏసీబీకి చిక్కిన స్పెషల్ ఆర్‌ఐ




కవాడిగూడ, మే 28: ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం లంచం తీసుకుంటూ.. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ ఆర్‌ఐ ఏసీబీకి చిక్కాడు. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని సీతాఫల్‌మండిలో నివాసముంటున్న జి.రామకృష్ణ క్యాంటిన్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి కుటుంబసభ్యుల్లో ఒకరు చనిపోవడంతో ఆమె పేరుమీద తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించేందుకు బ్యాంక్ అధికారులు ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలని సూచించారు. ఈ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న జి.రామకృష్ణ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ఆర్‌ఐ భూపాల మహేశ్‌ను కలిశారు. సర్టిఫికెట్ కావాలంటే మీరు కోర్టు నుంచి తీసుకోవాల్సి ఉంటుందని, అది ఆలస్యమవుతుందని, సర్టిఫికెట్ త్వరగా కావాలంటే లక్షా 25 వేలు లంచం ఇవ్వాలని స్పెషల్ ఆర్‌ఐ రామకృష్ణను అడిగాడు. తాను అంత చెల్లించుకోలేనని చెప్పినా.. వినిపించుకోకుండా లక్షా పదివేలు ఇవ్వాల్సిందేనని అప్పుడే సర్టిఫికెట్ జారీ చేస్తానన్నాడు. దీంతో రామకృష్ణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సిటీ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసు బృందాలు.. బుధవారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న మహేశ్‌కు లంచం ఇవ్వడానికి బాధితుడు రామకృష్ణకు 25 వేల రూపాయల నగదు ఇచ్చి లోపలికి పంపించారు. రామకృష్ణ నుంచి స్పెషల్ ఆర్‌ఐ మహేశ్ 25 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భూపాల మహేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

**శ్రీశైలం ఎడమగట్టు కాల్వ పథకానికి (ఎస్ఎల్‌బీసీ) రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే కృష్ణాజలాలు అక్కంపల్లి రిజర్వాయర్‌లో వచ్చిపడతాయి. కేసీఆర్ ఈ సుంకిశాల పథకాన్ని ఎందుకు తెరపైకి తెచ్చారో అర్థం కావడం లేదు. ఇది అనవసర ప్రాజెక్టు..**

**సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిన సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులో ఐదో మోటారు ఏర్పాటు చేయాలి. దాని ద్వారా కృష్ణాజలాల్ని ఎత్తిపోసి నేరుగా లింక్ కెనాల్ లోగానీ జలమండలికి చెందిన కోదండాపూర్ ట్రీట్‌ప్లాంటుకుగానీ తరలించాలి.**

**సుంకిశాలకు ప్రత్యామ్నాయంగా నీటి పారుదల శాఖ ఇంజినీర్లు పలు దఫాలుగా రూపొందించిన ప్రతిపాదనలు ఇవి.**



నిర్మాణంలో సుంకిశాల ప్రాజెక్టు (ఫైల్)

# సిటీకి సుంకిశాలే శరణ్యం

### కేసీఆర్ దిశలోనే కాంగ్రెస్ సర్కారు.. ఏప్రిల్‌లోగా ప్రాజెక్టు పూర్తి చేసేలా కార్యాచరణ

**సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 28 (నమస్తే తెలంగాణ):**

నాగార్జునసాగర్ జలాశయంలో డెడ్ స్టోరేజీ నుంచి కూడా హైదరాబాద్ మహా నగరానికి శాశ్వత ప్రాతిపదికన నీటిని తరలించే సుంకిశాల పథకాన్ని అటకెక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకున్న పరిణామాలకు ఉదాహరణ మాత్రమే ఇవి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎంతో ముందుచూపుతో ఈ పథకాన్ని చేపట్టి 80 శాతానికి పైగా పనులను సైతం పూర్తి చేయగా, రిటెయినింగ్ వాల్ కుప్పకూలిన తర్వాత ప్రభుత్వం అనేక ప్రత్యామ్నాయాల్ని అన్వేషించింది. కానీ అవేవీ ఆచరణ సాధ్యంకాదని తేలడంతో ఇప్పుడు కేసీఆర్ హయాంలో చేపట్టిన సుంకిశాల పథకాన్నే పూర్తి చేయడం అనివార్యంగా మారింది. గత ఏడాది పుష్కలమైన వరద వచ్చి సముద్రంలో జలాలు కలిసినప్పటికీ హైదరాబాద్ తాగునీటి కోసం జలమండలి అత్యవసర మోటార్లను ఏర్పాటు చేయాల్సిన విషమ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సుంకిశాలను పూర్తి చేసేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంది. గత అనుభవాల దృష్ట్యా సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సాగునీటి ప్రాజెక్టుల్లో గేట్లను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక నిపుణులు కన్నయ్య నాయుడిని రంగంలోకి దింపారు. ఈ మేరకు ఎండీ అశోక్‌రెడ్డి రెండు రోజుల కిందట కన్నయ్య నాయుడితో కలిసి సుంకిశాల పథకం పనుల వద్దకు వెళ్లి పరిశీలించారు. నిర్మాణ సంస్థ, ఇంజినీర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏప్రిల్‌లోగా పథకాన్ని పూర్తి చేసేందుకుగాను రూట్‌మ్యాప్‌ను రూపొందించుకున్నారు.

హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థలో సుమారు 48 శాతం వరకు కృష్ణాజలాలే ఉంటాయి. ఇంత కీలకమైన జలాలను నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి సేకరిస్తారు. నల్లగొండ జిల్లాలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్ల ద్వారా ఎత్తిపోసి... అటు నుంచి జలమండలి కోదండాపూర్ వద్ద నిర్మించిన నీటి శుద్ధి కేంద్రానికి తరలించి శుద్ధి చేసిన తర్వాత నగరానికి పైపులైన్ల ద్వారా తీసుకువస్తారు. అయితే సాగర్‌లో 510 అడుగుల నీటి మట్టం ఉంటేనే మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్ల ద్వారా సాఫీగా జలాల ఎత్తిపోత సాధ్యమవుతుంది. నీటిమట్టం తగ్గేకొద్దీ సరఫరా అంతరాయం కలుగుతుంది. అందుకే ప్రతి ఏటా వేసవి వచ్చే వరకు జలమండలి అత్యవసర మిగతా IIవ పేజీలో



సుంకిశాల ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి (ఫైల్)

## గ్రేటర్‌కు రెండ్రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించడంతో రాగల రెండు రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ, మరికొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతుపవనాల ఆగమనంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి పడిపోయాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 30.1, కనిష్ఠం 22.9 డిగ్రీలు, గాలిలో తేమ 70 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



# రెండ్రోజుల్లో నీ పని చెబుతా..

- టౌన్ ప్లానింగ్ మహిళా డీసీపీపై ఎమ్మెల్యే దానం అనుచరుడి వీరంగం
- మానసికంగా కుంగిపోయిన బాధిత అధికారి

**బేగంపేట, మే 28:**

'రెండు రోజులు ఆగు నీ పని చెబుతా.. నిన్ను ఎక్కడ నిల్చోబెట్టాలో అక్కడ నిల్చోబెడతా.. రెండు రోజుల్లో నీ పని చెప్తా'.. అంటూ ఓ మహిళా అధికారిపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడు వీరంగం సృష్టించాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన సంబంధించి పోలీస్ ఉన్నతాధికారులకు, జీహెచ్ఎంసీ జెడ్సీకి, డీసీకి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వివరాలివి.. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని వెల్కిన్ పార్క్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న ఆక్రమణల తొలగింపు విషయమై బేగంపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్‌కు ఫిర్యాదులు అందాయి. టౌన్ ప్లానింగ్ డీసీపీ సుష్మిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 17న వాటిని కూల్చివేయాలని నిర్ణయించుకున్నారు. ఇంతలోనే మరుసటి రోజు వాటిపై కోర్టు ఆర్డర్స్ ఉన్నాయంటూ ముందు రోజు రాత్రి తెలియడంతో ఎంఎస్సీ ఆదేశాల మేరకు కూల్చివేతల నిర్ణయాన్ని విరమించుకున్నారు. కూల్చివేతలు చేయకపోవడంపై ఈ నెల 21న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అనుచరుడు సుదీప్ పటేల్ బేగంపేట డిప్యూటీ కమిషనర్ చాంబర్‌కు వచ్చాడు. అదే సమయంలో డీసీ తన చాంబర్‌కు టౌన్ ప్లానింగ్ డీసీపీని పిలిపించారు. ఆమె వివరణతో కూడిన లెటర్ ఇచ్చే లోగానే ఆమెపై సుదీప్ పటేల్ చెలరేగిపోయాడు. టౌన్ ప్లానింగ్ డీసీపీతో పాటు ఎంఎస్సీని అమర్యాదగా, అసభ్య పదజాలంతో దూషించడం మొదలుపెట్టాడు. తీవ్ర మనస్తాపం చెందిన సుష్మిత సుదీప్ పటేల్ పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు లేఖ రాయాలంటూ డిప్యూటీ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు ఆయన జరిగిన ఘటనపై నార్త్ జోన్ డీసీపీకి సుదీప్ పటేల్ పై చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. సుష్మిత వెస్ట్‌మారేడ్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. కాగా, మానసికంగా కుంగిపోయిన సుష్మిత డిప్రెషన్‌లోకి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# నగరం.. దోమల మయం

### వర్షాకాలానికి ముందే నివారణ చర్యలు తీసుకోని బల్దియా

**వరుస వానలతో పొంచి ఉన్న సీజనల్ ముప్పు**



సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వానలు షురువయ్యాయి. 2009 తరువాత 15 రోజుల ముందే వర్షాకాలం ప్రారంభమైంది. గడిచిన మూడు నాలుగు రోజులుగా వానలు కురుస్తుండటంతో నగరం అప్పుడే చిత్తడిగా మారింది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకోవడంతో పాటు గాలిలో తేమ శాతం పెరగడంతో వాతావరణం కొంత చల్లబడింది. దీంతో జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో కూడిన సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉందంటున్నారు వైద్యనిపుణులు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించడం సహజమే అయినప్పటికీ ఈసారి అనుకోకుండా 15 రోజుల ముందే వానలు కురుస్తుండటం, దానికి తోడు దేశవ్యాప్తంగా కరోనా కేసులు కలవరపెడుతుండటంతో పరిస్థితి అయోమయంగా మారింది.


### మొదలైన దోమల బెడద..

నాలుగైదు వర్షాలు కురిశాయో లేదో అప్పుడే దోమల బెడద మొదలైంది. దాదాపు గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. వాస్తవానికి వర్షాకాలం ప్రారంభానికి ముందే జీహెచ్ఎంసీ అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ అటు జీహెచ్ఎంసీ అధికారులు గానీ, ఇటు వైద్యాధికారులు గానీ సీజనల్ నివారణ చర్యలు తీసుకోవడం లేదు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు యాంటీ లార్వా, ఫాగింగ్ తదితర చర్యలు చేపట్టాలి. అంతే కాకుండా బస్తీలు, కాలనీలు, ముఖ్యంగా మురికి వాడల్లో కాలువలు, కుంటలు, నాలాల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలి. కానీ సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని వైద్యశాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల దోమలు వృద్ధిచెంది సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు లేకపోలేదంటున్నారు వైద్యనిపుణులు.

### సాధారణంగా..

సాధారణంగా వర్షాకాలంలో ఫ్యాక్టరేబుల్ డిసీజెస్(దోమకాటుతో వచ్చే వ్యాధులు), వాటర్ బాండరెబుల్ డిసీజెస్(నీటివల్ల వచ్చే వ్యాధులు) వ్యాప్తి చెందే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా వర్షాల వల్ల జలుబు, జ్వరం, దగ్గుతో పాటు వైరల్ ఫీవర్స్, ఫ్లూ వంటివే కాకుండా దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, కలుషిత ఆహారం, నీటి వల్ల డయేరియా, కామెర్లు, టైఫాయిడ్, హెపటైటిస్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కరోనా అలజడి సమయంలో సీజనల్ లక్షణాలు, కరోనా లక్షణాలను బేరీజు వేసుకోవడం కొంత కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా వర్షంలో తడిసిన వారికి లేదా వాతావరణ మార్పుల కారణంగా జలుబు, జ్వరం, దగ్గు రావడం సహజం. అదే సమయంలో కరోనా సోకినా దానిని సీజనల్‌గా భావించే ప్రమాదం లేకపోలేదు. సీజనల్‌లో వచ్చే వ్యాధుల్లో ప్రధానంగా డెంగీ,

మిగతా IIవ పేజీలో



# బాబోయ్ ఇవేం రోడ్లు!

### మరమ్మతులకు నోచుకోని రహదారులు

- 20వేలకు పైగా పాట్‌హోల్స్ ఉన్నట్లు అంచనా
- దెబ్బతిన్న రోడ్లను పట్టించుకోని అధికారులు
- నరకప్రాయంగా మారిన ప్రయాణం

**సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ) :**

గ్రేటర్‌లో ఏ రోడ్డును చూసినా.. ఏ ప్రాంతంలో చూసినా గుంతలే..!! ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రోడ్ల దాకా సాఫీగా ప్రయాణించేందుకు వీలు లేకుండా ఉంది. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. ఒకవైపు వర్షాకాలం సమీపించడం..మరోవైపు రహదారుల మరమ్మతులలో అధికారుల నిర్లక్ష్యం వహించడంతో చాలా చోట్ల రహదారులు దెబ్బతిని ఉన్నాయి. 20వేలకు పైగా పాట్‌హోల్స్ ఏర్పడినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేయగా, మరమ్మతు పనులను చేపట్టడం లేదు. ఈ క్రమంలోనే నిత్యం వందలాది ఫిర్యాదులు జీహెచ్ఎంసీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వస్తున్న అధికారులు స్పందించడం లేదు. దీంతో చాలా చోట్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



### ఐఆర్‌సీ నిబంధనలకు తూట్లు

జీహెచ్ఎంసీ పరిధిలో 9,013 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. ఇందులో 2,846 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 6,167 కిలోమీటర్ల అంతర్గత రోడ్లు ఉన్నాయి. ఇందులో 70 శాతం రోడ్లపై గుంతలు

మిగతా IIవ పేజీలో



నాచారం-చిలుకలగూడ రోడ్డు దుస్థితి ఇది



